# గుండ్లు మునిగె - బెండ్లు తేలె

"మల్లేశం బాబూ... మల్లేశం గారూ .... !" ఉదయమే గాబరాగా పిలుస్తూ గడపదాటి ఇంట్లోకొస్తున్న పక్కింటి పరమేశ్వర్‌ను చిరనవ్వుతో ఆహ్వానించి కుర్చీ చూపించాడు మల్లేశం.

"మ్మీ ... మీ ఫోన్ పనిజెయ్యడం లేదట గదా !" ఆయాసాన్నణుచుకుంటూ ఇంకేదో చెప్పబోయాడు పరమేశ్వర్.

"నిజమే... ముందు మీరలా కూచోండి." అంటూ తాను గూడా కూచున్నాడు. పరమేశ్వర్ నెమ్మదించాడు. నోరు తెరవబోయాడు. మల్లేశం పట్టువదలని విక్రమార్కుని అవతారమని ఆ గల్లీలో అందరికీ తెలుసు.

"అద్సరే గానీ... " మల్లేశమందుకున్నాడు.

"అది కాదండీ ...." సర్దుక్కూచున్నాడు పరమేశ్వర్.

"అబ్బా ! మనం పక్క పక్క ఇంటివాళ్లం. ఇరుగుపొరుగు వాళ్లంటే ఆత్మీయ బంధువులని మనకు తెలుసుగదా !" మల్లేశం ఖుషీగా మాట్లాడుతున్నాడు.

"నిజమే కానీ... తెల్లవారకముందే నాకు ఫోనొచ్చిందండీ. అదేమిటంటే...."

"శుభం. శుభోదయాన శుభవార్తలే వింటాంగానీ ఏవిటీ ... మీరు అటు రిటైరయారో లేదో ఇటు రాజకీయాల్లో రాణిస్తున్నారటా... "

"అంటే ...." పరమేశ్వర్ పాతబుర్రకందలేదు విషయం. మొహం పాడుబడ్డ పాతగోడలాగైంది. అర్థంకాని విషయం అపార్థానికి దారిదీయొచ్చు. అయోమయంగా చూస్తున్నాడు.

"అబ్బే ! మీరు మన వీధి జనాల సమస్యలను పట్టించుకుంటున్నారు. వీలైనంత సాయం చేస్తున్నారు. పరోపకారం మిదం శరీరమన్నారు గదా !"

"థాంక్స్ !" మొహం ఫోకస్ బల్బులా వెలిగింది.

మల్లేశం భార్య మల్లిక పొగలు కక్కుతున్న చాయ కప్పుల్ని టీపాయ్ మీదుంచి కొప్పు సర్దుకుంటూ, చక్కగా వంటింట్లో కెళ్ళింది. కప్పు పరమేశ్వర్ చేతికందించి దర్జాగా ప్రారంభించాడు మల్లేశం.

"పెంచి పోషించిన సమాజానికి మనం ఆజన్మాంతం ఋణపడి ఉంటాము. వయసులో ఉన్నప్పుడు సంపాదనలో బిజీయైనా మీలాగా రిటైరయాక నలుగురికీ సేవచేస్తే పుణ్యం, పురుషార్థం."

గరం చాయ నరాల్లో సరిగమలు పలుకుతోంది. ముఖ ప్రస్తుతి పరమేశ్వర్‌ను పులికింపజేస్తోంది. "ఎంతైనా మీరదృష్టవంతులు..." మల్లేశం మాటామంతి నల్లేరు మీద

బండినడకలా సాగిపోతుంది. "ఉన్న ముగ్గురు పిల్లలకు సర్వీసులో ఉన్నప్పుడే పెళ్లిళ్లు చేశారు. ఇప్పుడు ప్రజాసేవ చేస్తున్నారు. అయినా... నేటి గల్లీ సేవకులే రేపటి ఢిల్లీ నాయకులండీ. అంతెందుకూ..." గుక్క తిప్పుకోవడం లేదు.

గుండ్లు మునిగె, బెండ్లు తేలెనన్న సామెత అక్షరాలా అమలైంది. మొదట తటపటాయింపు, పరితాపం, ఆ తర్వాత పరమేశ్వర్ తబ్బిబ్బు, మరో మెట్టుపైన మెప్పుకోలు. ... చెబుతామనుకున్న విషయం మునిగి వినాలనే కుతూహలం డామినేట్ చేస్తోంది. దాన్నంతా అదిమిపెట్టి వచ్చిన విషయం చెప్పాలనిపించిందో క్షణం.

"థాంక్స్ ! మీది మంచిగుణం కాబట్టి నేను మంచిగా కన్పిస్తున్నాను. కానీ... నాకు తెల్లవారక ముందే ఫోనొచ్చింది..." గొంతు సవరించుకుంటూ చెప్పబోయాడు.

"వస్తే మంచిదేలెండి. మీరు మీ ముప్పయ్యేదేళ్ళ సర్వీసులో ఏ రిమార్కు లేకుండా పంజేశారు. ఇప్పుడు రాజకీయాల్లోకి దిగుతున్నారు..."

"అయ్యయ్యో ! రాజకీయాల్లోకి నేనెప్పుడు దిగానండీ ?"

"నేనింతకు ముందే చెప్పానుగదా, నేటి గల్లీ సేవకుడే ... "

"రేపటి ఢిల్లీ నాయకుడు... "

గొల్లున నవ్వారిద్దారూ. సిటీ చౌరస్తాలో దారితప్పిన గ్రామ పౌరుడిలా విషయం దారి మళ్లింది. మాటామంతి సాగుతూనే ఉంది.

మల్లిక పరుగులాంటి నడకతో వచ్చింది. "ఏవండీ ! మన ఫోన్ బాగైంది. ఇప్పుడే మీ తమ్ముడు హైద్రాబాదు నుండి బయలుదేరాడటా ... మీ అమ్మగారు చనిపోయారటా. మనూరు బస్సు అరగంట క్రితమే వెళ్ళిపోయుంటుంది. మరో బస్సంటే ఇహ సాయంత్రమే..." గాబరాగా చెబుతోంది.

"అయ్యయ్యో !" మల్లేశం గుండెలు బాదుకున్నాడు. "మన ఫోన్ చెడిపోతే పక్కింటి పరమేశ్వర్ గారి ఫోన్ బాగానే ఉందిగదా" గోడుగోడు మంటున్నాడు. "ఇలాంటి అర్జంటు అవసరాల కోసమే గదా మన పల్లెటూరింట్లో ఫోన్ పెట్టించాను" నుదురు కొట్టుకొంటున్నాడు.

"అయ్యో బాబూ" అసలు సంగతి గుర్తుకొచ్చింది పరమేశ్వర్‌కు "గంట క్రితం నేను మీ ఇంటికొచ్చింది ఆ విషయం చెబుదామనే" పరమేశ్వర్ లేచినుంచున్నాడు. "ఉదయమే మీ తమ్ముడు ఊరినుండి ఫోన్ చేశాడు. ఇదే సంగతి చెప్పాడు. చావు కబురు మీకు చల్లగా చెబుదామనకున్నాను కాని మీరు నన్ను చెప్పనిచ్చారా ? నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్‌లా మాట్లాడ్తున్నారు. నన్ను బలవంతంగా బాతాకానీ లోకి దింపేశారు..."

*(ప్రసారిక మాసపత్రిక, మార్చి 2005)*